
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 5 | ఏప్రిల్ | 2024




'మద్దతు' దక్కని పెసర
యాసంగిలో సాగు చేసిన పెసర పంటకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.8,558 మద్దతు ధర దక్కక రైతులు నష్టపోతున్నారు. 8లో



వైభవంగా శ్రీవారి కల్యాణం
పాల్వంచలోని శ్రీనివాసగిరి గుట్టపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. 8లో

గరిష్టం/కనిష్టం 39°/23°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. గంటగంటకూ పెరుగుతూ మధ్యాహ్నానికి అధికమవుతుంది.



న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజల అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ.జి.సుదర్శన్, అర్చకులు, వేదపడింతులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

రామయ్య కల్యాణోత్సవానికి గోటి తలంబ్రాలు



పాదయాత్రగా ఆలయానికి వెళ్తున్న భక్తులు

భద్రాచలం అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం జరగనుండగా ఖమ్మంకు చెందిన శ్రీ లక్ష్మీ బాలాజీ సేవా సమితి బృందం సభ్యులు గురువారం కోటి గోటి తలంబ్రాలను సమర్పించారు. చింతకాని మండలంలో సేవా సమితి బాధ్యులతో పాటు కొందరు రైతులు వరి పంట సాగు చేయగా, ధాన్యాన్ని గోటితో వలిచి తలంబ్రాలు సిద్ధం చేశారు. ఈ తలంబ్రాలకు ఖమ్మం కమాన్‌బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు చేశాక గురువారం ఉదయం భద్రాచలం ఆలయంలో సమర్పించారు. సేవా సమితి అధ్యక్షురాలు వడ్డే లక్ష్మీతో పాటు భక్తులు పాల్గొన్నారు. అలాగే, హైదరాబాద్‌కు చెందిన భక్తులు కూడా గోటి తలంబ్రాలతో పాటు సీతమ్మకు సారె సైతం అందజేశారు.

రేగళ్లగుంపులో డ్యూయల్ సిస్టం పంపు ఏర్పాటు

అశ్వారావుపేట: మండల పరిధిలోని బచ్చువారిగూడం పంచాయతీ రేగళ్లగుంపులో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సలీం, ఏఈఈ లక్ష్మి గురువారం డ్యూయల్ సిస్టం పంపు ఏర్పాటు చేశారు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఈ పంపు ఏర్పాటు చేశారు. అడవిలో మూగజీవాల కోసం అటవీశాఖ ఏర్పాటు చేసిన సోలార్ పంపు నుంచి పగటి వేళ నీరు అందేలా, రాత్రి వేళల్లో చేతిపంపుతో నీళ్లు పొందేలా ఏర్పాటు చేశారు.

నేడు జీయర్ స్వామి రాక

దమ్మపేట : మండలంలోని గుండుగులపల్లిలో గల ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నివాసానికి త్రిదండి చిన్న జీయర్‌స్వామి శుక్రవారం రానున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన వెలువడింది. అనంతరం జీయర్‌స్వామి అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.

ఎమ్మెల్సీ తుది ఓటరు జాబితా విడుదల

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్–ఖమ్మం–నల్గొండ శాసనమండలి స్థానానికి జరగనున్న ఎన్నికలకు సంబంధించి జిల్లాలో తుది ఓటరు జాబితాను కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 39,897 మంది ఓటుహక్కు నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరిలో పురుషులు 22,485 మంది, మహిళలు 17,412 మంది ఉన్నారని చెప్పారు. జిల్లాలోని 29 ప్రాంతాల్లో 55 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి, నామినేషన్ తేదీ వరకు అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

రాష్ట్ర పండుగ కలేనా?

శ్రీరామ నవమి వేడుకలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారంటే అందుకు ఏకైక కారణం భద్రాచలంలో వందల ఏళ్లుగా జరుగుతున్న శ్రీ సీతారాముల కల్యాణమే. అయితే సీతారాముల కల్యాణ వేడుకకు సముచిత గుర్తింపు, నిధులు అందివ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదరణ కరువవుతోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



శ్రీ సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు (ఫైల్)

శ్రీరామ నవమికి ఆ హోదా కల్పించాలంటున్న భక్తులు

- అమలైతే భారీగా నిధులు వచ్చే అవకాశం
- ప్రస్తుతం హుండీ నిధులతోనే శ్రీరాముడి కల్యాణం
- సర్కారు నుంచి కరువైన ఆర్థిక మద్దతు

తానీషా కాలంలోనే గుర్తింపు..

మధ్యయుగాల కాలంలో పాల్వంచ (హస్నాబాద్) తహసీల్దార్‌గా పని చేసిన కంచర్ల గోపన్న భద్రాచలంలో సీతారాములకు ఆలయాన్ని నిర్మించారు. ఆ తర్వాత కాలంలో ఇక్కడ చైత్ర శుద్ధ నవమి రోజున సీతారాముల కల్యాణం జరిపించే పద్ధతిని ఆయన ప్రవేశపెట్టారు. అనంతరం అప్పటి గోల్కొండ నవాబు అయిన తానీషా సైతం ఈ వేడుకలో భాగస్వాములయ్యారు. సీతారాముల పెళ్లికి స్వయంగా హాజరై పట్టువస్త్రాలు సమర్పించడమే కాక ముత్యాల తలంబ్రాలు, గులాల్ అందించడంతో పాటు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచారు. స్వాతంత్య్రం వచ్చేనాటికి నవమి వేడుకలకు అప్పటి ప్రభుత్వం తరఫున రూ.1,300 అందించారని రికార్డులు చెబుతున్నాయి. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ వరకు నవమి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రులు పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీ కొనసాగుతూ వస్తోంది. కానీ మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా నవమి వేడుకలకు రాష్ట్ర పండుగ గుర్తింపు, ప్రత్యేక నిధులు అందించే విషయంలో ఎలాంటి ప్రయత్నం జరగలేదు.

రాష్ట్ర గుర్తింపు దక్కితే..

మేడారంలో ఆదివాసీల ఇలవేల్పులైన సమ్మక్క సారలమ్మ జాతర రెండేళ్లకు ఓసారి జరుగుతుంది. అనాదిగా గిరిజన పూజారులే చందాలు వసూలు చేసి జాతర నిర్వహించేవారు. ప్రభుత్వ సహకారం నామమాత్రంగా ఉండేది. అయితే 1996లో మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించింది. ఆ వెంటనే 1998లో జంపన్న వాగుపై వంతెన నిర్మించారు. అప్పటికే మేడారం జాతరకు భక్తుల రాక, నిధుల ప్రవాహం పెరిగాయి. ప్రతీ జాతరకు భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించేందుకు వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి సైతం నిధులు కేటాయిస్తున్నారు. ఇలా రూ. రెండు కోట్లతో మొదలైన నిధుల ప్రవాహం ఇప్పుడు ప్రతీ జాతరకు రూ.100 కోట్లకు పైమాటే అనే స్థాయికి చేరుకుంది. ఫలితంగా భక్తులకు డార్మిటరీలు మొదలుకుని కలెక్టర్ క్యాంపు ఆఫీసు వరకు అనేక సౌకర్యాలు వచ్చాయి. ఒకప్పుడు అడవిలా ఉన్న మేడారం ఇప్పుడు చిన్నపాటి పట్టణంగా మారింది. జాతరతో సంబంధం లేకుండా సెలవు రోజుల్లో భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు.

నెరవేరని హామీలు..

సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక ఆదాయం రూ. 40 కోట్లు ఉంటుంది. ఈ నిధులు అర్చకులు, సిబ్బంది జీతభత్యాలు, ముక్కోటి, నవమి వేడుకల నిర్వహణకే సరిపోతున్నాయి. భద్రాచలం మేజర్ పంచాయతీ ఆదాయం రూ. 4 కోట్లు ఉండగా వ్యయం రూ.3.50 కోట్లుగా ఉంది. వీటికి తోడు సీఎం హోదాలో కేసీఆర్ గతంలో భద్రాచలం ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించారు. భద్రాచలం పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 1000 కోట్లు ఇస్తానని మరోసారి హామీ ఇచ్చారు. కానీ ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా వందల ఏళ్ల చరిత్ర ఉన్న భద్రాచలంలో అభివృద్ధి, సౌకర్యాలు అందని ద్రాక్షే అవుతున్నాయి.

భద్రగిరిలో సౌకర్యాలు అంతంతే..

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. అయితే ఇక్కడ మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ముక్కోటి, శ్రీరామ నవమికి వచ్చే భక్తులకు గోదావరి తీరమే దిక్కవుతోంది. భద్రాచలంలో సరైన సౌకర్యాలు లేక ఇక్కడికి వచ్చే భక్తుల్లో సగం మంది దైవ దర్శనం అయిన వెంటనే ఇంటిదారి పడుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి తగ్గట్టుగా అభివృద్ధి పనులు, సౌకర్యాలు కల్పించడం సాధ్యం కావడం లేదు. నవమి ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హోదా దక్కితే ఇటు దేవాదాయ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి నిధులు మంజూరవుతాయి. ఫలితంగా ఆలయంతో పాటు పట్టణంలోనూ మౌలిక సదుపాయాలు మెరుగవుతాయి.

తాగునీటి సమస్య | నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్



మాట్లాడుతున్న సురేంద్రమోహన్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, జిల్లా అటవీ అధికారి కృష్ణగౌడ్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో తాగునీటి వనరులు, లభ్యత, సరఫరా తదితర వివరాలను ఆడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఎద్దడిపై పత్రికల్లో వచ్చిన కథనాలపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. మారుమూల గొత్తికోయ గ్రామాలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి సౌకర్యాలు లేవని, చెలిమెల ద్వారా నీరు తాగుతున్నారని, ట్యాంకర్ల ద్వారా రవాణాకు ఇబ్బందులు ఉన్నాయని అధికారులు వివరించారు. అటవీశాఖ అనుమతులు ఇస్తే రోడ్లు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని అటవీ శాఖాధికారి కృష్ణగౌడ్‌కు ప్రత్యేకాధికారి సూచించారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపడుతున్న చర్యలు బాగున్నాయని అభినందించారు. ఏదైనా సమస్య రావడానికి ముందే గుర్తించి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్లను ఆదేశించారు. తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి అవకాశం ఉంటుందని రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు కాంతారావుకు సూచించారు. కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో డీఆర్‌డీఓ విద్యాచందన, మిషన్ భగీరథ సీఈ శ్రీనివాసరావు, ఎస్‌ఈ సదాశివకుమార్, ఈఈ తిరుమలేష్, ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, జెడ్పీ సీఈఓ ప్రసూనారాణి, భూగర్భ జల శాఖాధికారి బాలు, డీపీఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న సురేంద్రమోహన్

భద్రాచలం/బూర్గంపాడు: తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేధికారి సురేంద్రమోహన్ గురువారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వాచనం అందజేశారు. తొలుత సురేంద్రమోహన్‌కు సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో భద్రాచలం ఆర్డీఓ దామోదరరావు స్వాగతం పలికారు.

మౌలిక వసతులపై దృష్టి



ఓటరు అవగాహన ర్యాలీలో కలెక్టర్ ప్రియాంక ఆల, అధికారులు

కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి

చుంచుపల్లి: ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. చుంచుపల్లి మండలంలోని మారుమూల గ్రామాలైన జగ్గారం, మర్రిగూడెం, పాలవాగు, గడ్డిగుప్పలో గురువారం ఆమె పర్యటించారు. తాగునీటి ఎద్దడి, విద్య, వైద్యం, రేషన్‌కార్డులు, పెన్షన్లు తదితర సమస్యల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి వసతితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వైద్య సదుపాయాలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థుల చదువులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ప్రజలు అక్కడక్కడ చెలిమల నుంచి నీరు తెచ్చుకుంటున్నారని, బోర్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

శిశు మరణాలను అరికట్టాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో శిశు మరణాలు అరికట్టాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో 0–5 సంవత్సరాల మధ్య జరిగిన శిశు మరణాల వివరాలపై ఆరా తీశారు. నివారణకు వైద్యాధికారులు, గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలకు ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి తరలించాలన్నారు. ఆస్పత్రుల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



చుంచుపల్లి మండలం జగ్గారంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

ఓటు భారం కాదు.. బాధ్యత

కొత్తగూడెంటౌన్: ఓటు వేయడం భారం కాదని, బాధ్యతని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటు హక్కు వినియోగించుకుని అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. ఓటర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వారు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఈసీ అవకాశం కల్పించిందని తెలిపారు. అర్హులంతా ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, డీడీఎంహెచ్‌ఓ సుకృత, డీఐఓ బాలాజీ నాయక్, కొత్తగూడెం సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ నరసింహారావు, ఆర్‌ఎంఓలు వీరబాబు, పుష్పలత, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా సంక్షేమాధికారి విజేత, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, డీఈ శివయ్య, ఏఈ వసంత, చుంచుపల్లి తహసీల్దార్ పానం కృష్ణ, ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఉపాధి ఏపీఎం రఘుపతి, పెన్షన్ డీపీఎం యాదయ్య, పంచాయతీ కార్యదర్శి హనుమంతు పాల్గొన్నారు.

ఖమ్మంలో బీఆర్‌ఎస్‌దే గెలుపు

పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/అశ్వారావుపేట: ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తాను విజయం సాధించడం ఖాయమని ఖమ్మం ఎంపీ, అభ్యర్థి నామా నాగేశ్వరరావు తెలిపారు. గురువారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం, నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో, అశ్వారావుపేటలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ పాలన సాగడం లేదని విమర్శించారు. గడిచిన వారం రోజులుగా తాను జిల్లాలో తిరుగుతున్నానని, సాగు, తాగు నీరులేక పంటలు ఎండిపోతున్నాయని, ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారని, సుమారు 15 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని పేర్కొన్నారు. కరువుతో అల్లాడుతున్న రైతులకు ఎకరానికి రూ.25 వేలు అందించాలని, పంటల మద్దతు ధరపై బోనస్‌గా రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ దగా చేసిందని ఆరోపించారు. లోక్‌సభ సమావేశాల్లో తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాడింది కేవలం బీఆర్‌ఎస్ ఎంపీలు మాత్రమేనన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఏనాడూ తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల గురించి మాట్లాడలేదని అన్నారు. ఆ పార్టీలకు ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం ముందంజలో ఉందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశామన్న భావనలో ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సమస్యలను పరిష్కరించామని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలలో విజయం సాధించడం ఖాయమన్నారు. కొత్తగూడెం సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్య సోన, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి జేవీఎస్ చౌదరి, లక్ష్మీదేవిపల్లి అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, అన్వర్‌పాషా, అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాళ్లు చిన్నంశెట్టి వరలక్ష్మి, సున్నం నాగమణి, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశరావు, వగ్గెల పూజ, మందపాటి రాజమోహనరెడ్డి, అంకత మల్లిఖార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

పాతాళంలోకి గంగ..

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- విచ్చలవిడిగా బోర్లు వేయడమే కారణం..
- నగటున నెలకు మీటరు దిగువకు పడిపోతున్న జలం
- అశ్వారావుపేట, కొత్తగూడెం, గుండాల మండలాల్లో భారీగా తగ్గుదల





పాండురంగాపురంలో అడుగంటిన చెరువు
(ఇన్‌సెట్) అడుగంటిన మూకమామిడి ప్రాజెక్టు

పాల్వంచరూరల్ : జిల్లాలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులు, ప్రాజెక్టుల్లో నీరు ఇంకిపోతుండగా బీళ్లను తలపిస్తున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం భూగర్భ నీటిమట్టం మరింత లోతుకు పోయింది. గతేడాది జిల్లాలో భూగర్భ నీటిమట్టం 9.47 మీటర్లు ఉండగా ఈ ఏడాది మార్చి వరకు 9.91 మీటర్ల లోతుకు వెళ్లింది. గతేడాది కంటే ఈ ఏడాది భూగర్భ నీటిమట్టం 0.44 మీటర్లకు పడిపోయింది. ప్రస్తుతం నమోదవుతున్న ఎండల తీవ్రతతో ఈ నెలాఖరు నాటికి మరింత దిగువకు పడిపోయే ప్రమాదం ఉందని భూగర్భ జల శాఖ అధికారులు అంటున్నారు. ప్రజలు మేల్కొని నీటిని పొదుపుగా వినియోగించుకుంటే ప్రమాద ఘంటికల ముప్పు నుంచి బయటపడొచ్చని సూచిస్తున్నారు.

అడుగంటిన చెరువులు, కుంటలు..

జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉండడం, యాసంగి పంటలు 90 శాతం బోరుబావులపై ఆధారపడడంతో భూగర్భ నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. ఈనెల ప్రారంభం నుంచే భానుడి ప్రతాపం 40 నుంచి 41 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,144 చెరువులు, కుంటలు ఉండగా ఈనెల ఇప్పటి వరకు 2,128 చెరువుల్లో 0 నుంచి 25 శాతం నీటిమట్టం ఉంది. 13 చెరువుల్లో 25 నుంచి 50 శాతం, 1 చెరువులో 50 నుంచి 75 శాతం, 2 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీటిమట్టం ఉంది.

తగ్గిన వర్షపాతం..

జిల్లాలో గతేడాది వర్షపాతం 1.507 మిల్లీమీటర్లు కురవగా ఈ ఏడాది 1.299 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. గతేడాది కంటే ఈసారి 200 మిల్లీమీటర్ల వర్షం తక్కువగా కురిసిందని అధికారులు చెబుతున్నారు. దీంతో నెలకు సగటున గతేడాది 1.09 మీటర్ల నీటిమట్టం తగ్గగా, ఈ ఏడాది 1.73 మీటర్లు తగ్గుతోంది. కొత్తగూడెం మండలంలో 29.38 మీటర్ల లోతులోకి నీటిమట్టం పడిపోయింది. గతేడాది ఇదే మండలంలో 25.26 మీటర్లలో ఉంది. అంటే గతేడాది కంటే ఈ ఏడాది 4 మీటర్ల దిగువకు నీటిమట్టం పడిపోవడం ఆందోళనకర అంశంగా అధికారులు పేర్కొంటున్నారు. గుండాల మండలంలో గతేడాది 5.34 మీటర్ల దిగువకు నీటిమట్టం పడిపోగా, ఈ ఏడాది 8.09 మీటర్ల దిగువకు పడిపోయింది. అశ్వారావుపేట మండలంలో గతేడాది 17.29 మీటర్లు దిగువకు పడిపోగా ఈ ఏడాది 18.94 మీటర్ల దిగువకు పడిపోయినట్లు అధికారులు తెలిపారు.

విచ్చలవిడిగా బోర్లు..

ఏజెన్సీలో భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా బోరు బావులను తవ్విస్తూ వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం అనుమతి లేకుండా బోర్లు వేయకూడదు. బోరు వేయాలంటే ముందుగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును పరిశీలించిన తహశీల్దార్ అక్కడి భూగర్భ జలాల పరిస్థితులను అంచనా వేసేందుకు జియాలజిస్టులకు రిపోర్టు రాస్తారు. వారు ఇచ్చే రిపోర్టు ఆధారంగా బోరుకు అనుమతి ఇస్తారు. ఇందుకు బోరు వేసుకునే వారు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే నిబంధనలు పాటించకుండానే చాటుమాటుగా బోర్లు వేస్తున్నా అందులో కొన్ని బోర్లలో నీళ్లు పడడం లేదు.

నీటిని పొదుపుగా వాడుకుంటే మంచిది



జిల్లాలో నీటి మట్టం తగ్గిపోతోంది. ఎండల తీవ్రత నేపథ్యంలో రానున్న రెండు నెలల్లో ఎక్కువ లోతుకు నీటిమట్టం పడిపోయే ప్రమాదం ఉంది. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకుంటే మంచిది. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు తవ్వించి నీటిని సంరక్షిస్తే భూగర్భ జలాలు తగ్గకుండా ఉంటాయి.

– బాలు, భూగర్భజల శాఖ ఏడీ

జిల్లాలో నీటి మట్టం వివరాలు (లోతు.. మీటర్లలో)

మండలం	మార్చి 2023	మార్చి 2024	తేడా
అళ్లపల్లి	7.33	6.79	0.54
అన్నపురెడ్డిపల్లి	16.06	15.65	0.41
అశ్వాపురం	6.29	4.80	1.49
బూర్గంపాడు	9.92	9.11	0.81
చంద్రుగొండ	10.99	10.08	0.92
చుంచుపల్లి	6.05	5.77	0.28
దుమ్ముగూడెం	4.10	3.91	0.19
కరకగూడెం	5.12	4.94	0.18
లక్ష్మీదేవిపల్లి	8.10	7.13	0.97
మణుగూరు	5.36	4.36	1.00
టేకులపల్లి	9.77	9.02	0.75
ములకలపల్లి	8.67	10.00	- 1.33
పాల్వంచ	8.41	9.62	- 1.20
పినపాక	10.10	10.78	- 0.68
సుజాతనగర్	5.48	5.65	- 0.17
ఇల్లెందు	6.52	6.78	- 0.27
అశ్వారావుపేట	17.29	18.94	- 1.66
భద్రాచలం	11.32	12.92	- 1.60
దమ్మపేట	21.24	21.97	- 0.72
గుండాల	5.34	8.09	- 2.74
జూలూరుపాడు	8.58	10.21	- 1.63
చర్ల	3.22	3.40	- 0.18
కొత్తగూడెం	25.26	29.38	- 4.12

‘మద్దతు’ దక్కని పెసర

ఉమ్మడి జిల్లాలో 9 వేల ఎకరాల్లో పంట సాగు

- యాసంగిలో కొనుగోళ్లపై దృష్టి సారించని ప్రభుత్వం
- ఇదే అదునుగా తక్కువ ధర చెల్లిస్తున్న వ్యాపారులు
- క్వింటాల్‌కు రూ.1,500 మేర నష్టపోతున్న రైతులు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పెసలు

ఖమ్మంవ్యవసాయం: యాసంగిలో సాగు చేసిన పెసర పంటకు మద్దతు ధర దక్కటం లేదు. పంట ప్రస్తుతం చేతికందుతుండగా, కొందరు రైతులు విక్రయాలు సాగిస్తున్నారు. పెసల నాణ్యత ఆధారంగా వ్యాపారులు గరిష్టంగా క్వింటాల్‌కు రూ.7,900 వరకు ధర పెడుతున్నారు. నాణ్యత తక్కువగా ఉంటే రూ.5 వేలకు మించి రావడం లేదు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.8,558గా మద్దతు ధర ప్రకటించినా, ఆ రేటు రైతులకు అందడంలేదు. ప్రభుత్వం కొనుగోళ్లపై దృష్టి సారించకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రెండేళ్ల నుంచి ఇదే తంతు కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోడంలేదు.

వర్షాభావంతో తగ్గిన సాగు, దిగుబడి

ఈ ఏడాది ఆశించిన వర్షాలు లేకపోవడంతో యాసంగిలో పెసర సాగు గణనీయంగా తగ్గింది. ఉమ్మడి జిల్లాలో ఏటా దాదాపు 20 వేల ఎకరాలకు పైగా రైతులు పెసర సాగు చేసేవారు. ఈ ఏడాది జలాశయాలు, భూగర్భంలో నీరు లేక 9,130 ఎకరాల్లోనే సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో 8,631 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 499 ఎకరాల్లో పంట సాగైంది. నీటి తడులు సమృద్ధిగా అందిన చోట ఎకరాకు 5నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రాగా, అరకొరగా నీటి తడులు తీసుకున్న పైర్లు ఎకరాకు 2నుంచి 3 క్వింటాళ్లు దాటడం లేదు. ఇటు దిగుబడి లేక, అటు ధర లేక రైతులు రెండు విధాలా నష్టపోతున్నారు.

నాఫెడ్ కొనుగోళ్లు చేపడితే మేలు

పంట నాణ్యతగా ఉన్నా క్వింటాల్‌కు రూ.1,500 పైగా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.8,558 ఉండగా.. వ్యాపారులు సగటున రూ.7 వేలకు మించి ధర పెట్టడం లేదు. ఇక నాణ్యత లేని పంటైతే రూ.5,500 వరకే చెల్లిస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు నాఫెడ్ సహకారంతో మార్క్‌ఫెడ్ పెసలను కొనుగోలు చేసింది. ఈసారి కూడా అలా కొనుగోళ్లు చేపడితేనే వ్యాపారులు సైతం ధర పెంచే అవకాశం ఉంటుంది.


జెండా పాటలో వ్యాపారులు, రైతులు

వ్యాపారుల సిండికేట్!

పెసర కొనుగోళ్లలో వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు న్యాయం జరిగే అవకాశమున్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో వ్యాపారులు గ్రామాల్లో క్వింటాకు రూ.5 వేల నుంచి రూ.6,500 వరకు చెల్లిస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.5,500 నుంచి రూ.7,900 వరకు ధర పలుకుతోంది. పంటకు డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

క్వింటాల్‌కు రూ.7వేలే...



నీటి సౌకర్యం సరిగా లేక ఎకరంలోనే పెసర సాగు చేశా. ఆరు బస్తాల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.8,558 కాగా వ్యాపారులు రూ.7,300కే కొనుగోలు చేశారు. ఇక కమీషన్లు, రవాణా, తరుగు పోతే క్వింటాకు రూ.7వేలకు మించి రాలేదు. మద్దతు ధరతో పోలిస్తే క్వింటాకు రూ.1,500 మేర నష్టపోయా.

– వంగూరి ప్రభాకర్, తెట్టెలపాడు, తిరుమలాయపాలెం మండలం

నాణ్యత ఉన్నా ధర రాలేదు..



ఎనిమిదిన్నర ఎకరాల్లో పెసర సాగు చేశా. ప్రస్తుతం రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన పెసర పంటను విక్రయానికి తీసుకువచ్చా. పెసలు బాగున్నాయని జెండాపాట పెట్టారు. జెండాపాటలో కనీస మద్దతు ధర కూడా లభించలేదు. నాణ్యమైన పెసలకు రూ.7,900 ధర నిర్ణయించారు. ప్రభుత్వ ధర ఎక్కువగా ఉంది కదా అన్నా పట్టించుకోలేదు.

– వెల్లంపల్లి నాగేశ్వరరావు, నాగులవంచ, చింతకాని మండలం

వైభవంగా శ్రీవారి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు


వేడుకకు హాజరైన భక్తులు

పాల్వంచ : గోవింద నామస్మరణతో పట్టణంలోని శ్రీనివాసగిరి మార్మోగింది. అశేష భక్త జన సందోహం నడుమ శ్రీనివాస కాలనీ గుట్టపై ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక తరలి వచ్చారు. సమారు 1500 మెట్లు ఎక్కి కొండపైకి చేరుకుని కల్యాణాన్ని తిలకించారు. తహసీల్దార్ వివేక్ ముత్యాల తలంబ్రాలు తీసుకురాగా, అయ్యప్ప దేవస్థానం కమిటీ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారు. గర్భగుడి నుంచి ఉత్సవ మూర్తులను పల్లకీలో మేళతాళాలతో కల్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, ప్రాభోధిక, అగ్ని ప్రతిష్ఠ, చతుస్టార్చన, ధ్వజారోహణ, నిత్య పూర్ణహుతి పూజలు చేశారు. అనంతరం శ్రీ వారి కల్యాణాన్ని వనపర్తికి చెందిన సౌమిత్రి రామాచార్యులు, తోలేటి నగేశ్ శర్మ, ఆరుట్ల ఫణిరాజాచార్యులు వైభవోపేతంగా జరిపారు. ఆ తర్వాత అన్నదానం నిర్వహించారు. కాగా, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా హాజరయ్యారు.

భక్తులకు సౌకర్యాలు..

భక్తుల సౌకర్యం కోసం గుట్టపై తాటి ఆకులతో చలువ పందిళ్లు వేశారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా తీర్థ ప్రసాదాలు, అక్షింతలు పంపిణీ చేశారు. తాగునీటి వసతి అందించారు. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఓఆర్‌ఎస్, గ్లూకోజ్ పౌడర్, మందులు పంపిణీ చేశారు. ఆలయ భక్తసమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, రాము, కందుకూరి రామకృష్ణ, మేదరమెట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఏసీటీఓ

రూ. 10 వేల నగదు స్వాధీనం


ఉద్యోగులను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

కల్లూరు/అశ్వారావుపేట: ఆధారాల్లేని నగదు ఉండడంతో వాణిజ్య పన్నుల శాఖ ఏసీటీఓ శ్రీరామ్, సిబ్బందిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరులోని తిరువూరు క్రాస్ వద్ద గురువారం తెల్లవారుజామున శ్రీరామ్, సిబ్బంది వాహనాల పత్రాలను పరిశీలిస్తుండగా, వారిని ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. వాణిజ్యశాఖ అధికారులు అక్రమంగా వాహనదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుతో ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేశ్ ఆధ్వర్యాన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీటీఓ శ్రీరామ్, సిబ్బంది వద్ద సరైన ఆధారాలు లేని రూ.10 వేల నగదు ఉండడంతో సీజ్ చేసి ఉద్యోగులను ఖమ్మం ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈమేరకు ఏసీటీఓ శ్రీరామ్, ఆఫీస్ సబార్డినేట్ రాజ్‌కుమార్, డ్రైవర్ జంగం మణికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

వసూళ్లపై ‘సాక్షి’లో ముందుగానే కథనం

అశ్వారావుపేటలో రాత్రి వేళల్లో కొందరు అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఈనెల 2న ‘సాక్షి’లో ‘పేటలో కమర్షియల్ దాడులు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. మరుసటి రోజే ఏసీటీఓ శ్రీరాంను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బిల్లులు లేని సరుకు తరలిస్తున్న వాహనదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉండగా, తాజాగా ఏసీబీ తనిఖీలతో సందేహాలకు సమాధానం లభించినట్లయింది.

భద్రాచలం ఆస్పత్రిని సందర్శించిన మెడికోలు


ఎన్‌ఆర్సీలో చిన్నారులకు అందించే పోషకాహార వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

భద్రాచలంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎంబీబీఎస్ రెండో ఏడాది విద్యార్థులు 30 మంది ఫీల్డ్ వర్క్‌లో భాగంగా గురువారం భద్రాచలం ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. అన్ని వార్డులను పరిశీలించారు. పీడియాట్రిక్ డిపార్ట్‌మెంట్‌లో చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలు, చిన్నారులు ఏయే వ్యాధుల బారిన పడుతున్నారు? తదితర వివరాలు తెలుసుకున్నారు. ఎన్‌ఆర్సీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, అందిస్తున్న సేవలు, పోషకాహార లోపానికి గల కారణాలు, అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులు రామకృష్ణ, రాజశేఖర్ రెడ్డి, పూజ, జగదీష్ తదితరులు వివరించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడీ మోకాళ్ల వెంకటేశ్వరరావు, ఎస్.అమ్మని, బి.భద్రమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ధర్మయుద్ధంలో బీజేపీదే విజయం

- భద్రాచలం నుంచి అయోధ్య వరకు ఆధ్యాత్మిక కారిడర్
- బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు


మాట్లాడుతున్న వినోద్‌రావు, పక్కన నాయకులు

సత్తుపల్లి/మధిర/అశ్వారావుపేట: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ధర్మయుద్ధం జరగనుండగా.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీకే విజయం దక్కుతుందని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. సత్తుపల్లి, మధిర, అశ్వారావుపేటల్లో గురువారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ కేంద్రంలో మోదీ ప్రభుత్వమే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, జిల్లాలో బీజేపీ ప్రతినిధి లేకపోతే అభివృద్ధికి అడ్డంకిగా మారనున్నందున తనను గెలిపించేలా కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పుణ్యక్షేత్రమైన భద్రాచలాన్ని మరింత అభివృద్ధి చేసి అయోధ్య వరకు ఆధ్యాత్మిక కారిడార్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా, పాలకుల వైఫల్యం వల్ల ఎన్నో ప్రాజెక్టులు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రాలేదని.. తనను గెలిపిస్తే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి భాగస్వామినవుతానని చెప్పారు. కాగా, సత్తుపల్లిలో బీజేపీ నాయకుడు దారపనేని కోటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, బీజేపీతో పాటు మిత్రపక్ష పార్టీల నాయకులు భాస్కర్ల వీరంరాజు, నాగేశ్వరరావు, సిలివేరు సాంబశివరావు, పారుపల్లి సురేష్, సుదర్శన్ మిశ్రా, గొట్టిముక్కల శ్రీనివాసరావు, గాదె రాంబాబు, మడివి రవి, మద్దాల దేవి, బండారు చందు, శ్యాంసుందర్ నాయక్, చావా కిరణ్, నాయుడు రాఘవరావు, పాలకొల్లు శ్రీను, బాలకృష్ణారెడ్డి, ఆచంటి నాగస్వామి, ఆపద రామారావు, పుల్లారావు, కొలికపోగు వెంకటేశ్వరరావు, గొల్లమూడి శ్రీను, ముత్తారావు, డేవిడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వాచ్‌మన్ మృతి

పాల్వంచ: భద్రాచలం పట్టణానికి చెందిన ఆసోజు భాగ్యరావు(60) పాల్వంచలోని బీసీ హాస్టల్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి 9 గంటలకు విధులకు వచ్చిన ఆయన గురువారం ఉదయం మృతి చెంది ఉన్నాడు. తోటి ఉద్యోగులు గుర్తించి ఉన్నతాధికారులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా మృతునికి గతంలో రెండు సార్లు గుండె సంబంధ సమస్యతో స్టంట్స్ వేసుకున్నాడు. రాత్రి వేళ గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

- 10 తులాల బంగారం, 80 తులాల వెండి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరు టౌన్: కొద్ది రోజులుగా పలు చోట్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. 10 తులాల బంగారం, 80 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మణుగూరు సీఐ సతీష్‌కుమార్ గురువారం వివరాలు వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం... పట్టణంలోని పూల మార్కెట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను గమనించి మణుగూరుకు చెందిన గంటా ప్రవీణ్, మాట్ల రాములు పారిపోతుండగా, పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తాళం వేసి ఉన్న ఇళ్ల చుట్టూ ఉదయం పూట రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. గతేడాది సెప్టెంబర్‌లో ముత్యాలమ్మనగర్, డిసెంబర్‌లో సమితిసింగారంలో, ఈ ఏడాది ఫిబ్రవరిలో అశోక్‌నగర్, శివలింగాపురం, మార్చిలో సుందరయ్యనగర్, సాయినగర్‌లో చోరీలకు పాల్పడ్డారు. సుమారు 25 తులాల బంగారు ఆభరణాలు, 80 తులాల వెండి చోరీ చేశారు. కాగా వారి నుంచి 10 తులాల బంగారం, 80 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. గంటా ప్రవీణ్‌పై గతంలో 15 చోరీ కేసులు నమోదవగా, అధికారుల సూచనల మేరకు పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. చోరీల్లో భాగస్వాములైన మరో ఇద్దరు మధు, సాగర్ పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా పట్టుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ప్రసాద్, షమీమ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గేదెను తప్పించబోయి కారు పల్టీ

మహబూబాబాద్ రూరల్: గేదెను తప్పించబోయి కారు పల్టీ సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు శివారు రజాలిపేట క్రాస్ వద్ద గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన శ్రీను, గుణశేఖర్, రోహిత్, సాయికృష్ణ కారులో ఓ వివాహానికి హాజరై తిరుగు పయనమయ్యారు. కురవి మీదుగా మహబూబాబాద్ వైపు వస్తుండగా బేతోలు శివారు రజాలిపేట క్రాస్ వద్ద ఎదురుగా గేదె వచ్చింది. తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారికి గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా క్షతగాత్రులను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మణుగూరు టౌన్: ఓ వృద్ధురాలు మతిస్థిమితం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మణుగూరులోని అశోక్‌నగర్‌లో గురువారం జరిగింది. పద్మావతి(63), శ్రీనివాసరాజు దంపతులు అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పద్మావతి మతిస్థిమితం కోల్పోయింది. గతంలోనూ రెండు సార్లు ఆత్మహత్యకు యత్నించింది. గురువారం ఉదయం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోగా, గమనించిన స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా, కొత్తగూడెం తరలించే క్రమంలో మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రధాన రోడ్డుపై డ్రెయినేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి మండలంలోని విశ్వరూపా థియేటర్ ఎదురుగా ఉన్న డ్రెయినేజీలో పడి గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచామని, మృతుడు నలుపు రంగు ప్యాంటు, గోధుమరంగు గీతాల చొక్కా ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87126 82035 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అటవీశాఖలో డీజిల్ కుంభకోణం?

ఇల్లెందు: అటవీశాఖ ఇల్లెందు డివిజన్ పరిధిలోని రేంజ్ కార్యాలయాల్లో డీజిల్ కుంభకోణం జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొమురారం, కాచనపల్లి, గుండాల రేంజ్ కార్యాలయాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.8 లక్షల డీజిల్ వాడినట్లు ఓ పెట్రోల్ బంక్‌కు చెల్లించారు. అయితే ఆ బంక్‌లో గడిచిన ఆరు నెలల కాలంలో ఒక్క లీటర్ డీజిల్ కూడా కొనుగోలు చేయకుండా, బ్యాంక్ అకౌంట్‌లో నగదు జమ చేశారు. వారం తర్వాత తమకు ఆ రూ.8 లక్షల డబ్బులు క్యాష్ అందజేయాలని అటవీశాఖాధికారులు కోరారు. అయితే డీజిల్ తమ వద్ద కొనుగోలు చేయకుంటే బిల్లు ఇవ్వలేమని బంక్ ఓనర్ పేర్కొన్నారు. దీంతో అటవీశాఖ అధికారులు పోలీసులను ఆశ్రయించగా, నగదు అటవీశాఖకు చెల్లించాలని పోలీసులు ఆదేశించారు. అందుకు బంక్ ఓనర్ మాత్రం అంగీకరించకపోవడంతో కేసు నమోదు చేస్తామంటూ బెదిరించారు. కేసు నమోదు చేశాక నగదు చెల్లిస్తానని, లేదంటే ఆ నగదును విజిలెన్స్ విభాగానికి అప్పగిస్తామని, వాడని డీజిల్‌కు వాడినట్లు డబ్బులు చెల్లించటం మాత్రం కుదరని, ఆడిట్ తనిఖీలో చిక్కుకుంటానని బంక్ యజమాని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఏదో కుంభకోణం జరిగినట్లు అనుమానించాల్సి వస్తోందని, ఆడిట్‌లో తాము ఇరుక్కుంటామని వాపోతున్నాడు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా తన ఖాతాలో నగదు జమ చేశారని పేర్కొంటున్నాడు.

విషయం తెలియక యజమాని ఆందోళన..

గుండాల, కొమురారం రేంజర్లు డీజిల్ ఖర్చులు వారి జేబు నుంచి ఖర్చు చేసి, బిల్లు మంజూరైన తర్వాత మార్చుకుంటారు. ప్రతీ నెల కొమురారం బంక్ నుంచి డ్రా చేసుకుంటారు. రెండు నెలల క్రితం అక్కడి యాజమాన్యం మారిన విషయం తెలియక అదే బంకుకు అకౌంట్‌కు జమ చేశారు. విషయం తెలియక ఆ యజమాని ఏదో జరుగుతుందని ఆందోళనతో డబ్బులు చెల్లించేందుకు భయపడుతున్నాడు.

–కర్నావత్ వెంకన్న, ఎఫ్‌డీఓ

సీట్ బెల్ట్ పెట్టుకోలేదని ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫైన్!



పోలీసులు జరిమానా విధించిన ట్రాక్టర్

పాల్వంచరూరల్: ట్రాక్టర్ డ్రైవర్ సీటు బెల్టు పెట్టుకోలేదంటూ బ్లూ కోల్ట్స్ పోలీసులు జరిమానా విధించిన ఘటన గురువారం వెలుగు చూసింది. పాల్వంచ మండలం నాగారం నుంచి పాల్వంచ వైపు మట్టిలోడ్‌తో ట్రాక్టర్ వస్తోంది. మార్గమధ్యలో ఆపిన బ్లూ కోల్ట్స్ పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్ సీటు బెల్టు పెట్టుకోలేదంటూ రూ.135 జరిమానా విధించారు. అయితే, ట్రాక్టర్‌కు సీటు బెల్టు ఉండదని పోలీసులకు చెప్పినా వినిపించుకోకుండా జరిమానా విధించారని డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా స్టీరింగ్ ఉన్న ప్రతీ వాహనం డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనల మేరకు సీట్ బెల్టు పెట్టుకోవాల్సిందేనని చెప్పడం గమనార్హం.

క్లుప్తంగా

అధిక చార్జీలు వసూలు చేయొద్దు


ధరల పట్టికను అందజేస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి కిషన్ రావు

భద్రాచలంఅర్బన్: ఆటో డ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేయొద్దని జిల్లా రవాణా శాఖ అధికారి కిషన్ రావు పేర్కొన్నారు. పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న రవాణా శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆటో యూనియన్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అమలు చేయాల్సిన ధరల పట్టికను ఆటో డ్రైవర్లకు అందించారు. పరిమితికి మించి ఆటోల్లో ప్యాసింజర్లను ఎక్కించొద్దని ఆదేశించారు. కాగా శ్రీసీతారామచంద్ర దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 17న జరిగే శ్రీరామ నవమి మహోత్సవానికి భక్తులకు అధిక సంఖ్యలో వచ్చే అవకాశమున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, ఆటో యూనియన్ నాయకులు, సభ్యులు, పాల్గొన్నారు.

భద్రాద్రిలో నిత్య అన్నదానానికి విరాళం


ఈఓకు డీడీ అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్న దానానికి ఏపీలోని గుడివాడ శాంతినగర్ కాలనీ వాస్తవ్యులు శశిదీప్–తులసి దంపతులు గురువారం రూ.50వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా వారికి అధికారులు అన్నదాన పథకం బాండ్లు అందజేశక స్వామి దర్శనం చేయించారు. అలాగే, భద్రాచలంలో ఈనెల 17న జరగనున్న శ్రీ రామనవమి తిరు కల్యాణ మహోత్సవాల సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఖమ్మం రీజినల్ హెడ్ హన్మంతరెడ్డి రూ.50 వేలు డీడీని ఈఓ. రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బ్రాంచ్ మేనేజర్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై అమెరికా వాసి యాత్ర

- కాలుష్య నివారణపై స్టీఫెన్‌సన్ ప్రచారం


యాత్రికుడు స్టీఫెన్‌సన్

ఇల్లెందు: అమెరికాకు చెందిన స్టీఫెన్‌సన్ వయస్సు 73 ఏళ్లు. ఇప్పటికే ఎన్నో దేశాలు తిరగగా కార్లు, బైక్‌లతో వాయు, శబ్ద కాలుష్యం ఎదురవుతోందని గుర్తించాడు. ఇందులో భాగంగా పొగతో వెదజల్లే కాలుష్యం ప్రమాదకరంగా మారగా.. ప్రజల్లో చైతన్యం నింపేందుకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం మహబూబాబాద్ నుంచి భద్రాచలం వెళ్తున్న స్టీఫెన్‌సన్ ఇల్లెందులో ఆగాడు. అక్కడ ఆయన మాట్లాడుతూ కార్లు, బైక్‌లతో అటు శబ్దం, ఇటు వాయు కాలుష్యం వెదజల్లుతోందని, సైకిల్ మాత్రమే ఎలాంటి కాలుష్యం వెదజల్లని వాహనమని తెలిపాడు. అందుకే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తాను సైకిల్ యాత్ర చేపట్టినట్లు వెల్లడించాడు.

నగదు స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చర్ల రోడ్డు వద్ద గురువారం వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు కారులో తరలిస్తున్న రూ.1,32,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ పీవీఎస్ రావు కథనం ప్రకారం.. చర్లకు చెందిన సాయి కుమార్ చర్ల నుంచి భద్రాచలానికి బొలెరో వాహనంలో ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా పట్టుకుని, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి హరీష్‌కు అప్పగించారు. అనంతరం పంచనామా చేసి నగదును సంబంధిత అధికారుల వద్ద జమ చేశారు.

సెల్‌షాపులో చోరీ

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని సెల్‌షాపులో బుధవారం రాత్రి చోరీ జరిగింది. షాపు పైకప్పు రేకులను పగులకొట్టి దుకాణంలోకి ప్రవేశించి ఆరు సెల్‌ఫోన్లు, యాపిల్ స్మార్ట్‌వాచ్ అపహరించారు. చోరీ చేసిన సొత్తు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను సంఘటనా స్థలాన్ని పరిశీలించారని ఎంఎస్ మొబైల్స్ షాపు యజమాని తెలిపారు.

ఏఈ సరెండర్

ఖమ్మంవ్యవసాయం: విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన ఖమ్మం విద్యుత్ ఆపరేషన్స్ సర్కిల్ పరిధిలోని ఓ ఏఈని అధికారులు సరెండర్ చేశారు. ఖమ్మం టౌన్–4 అసిస్టెంట్ ఇంజనీర్(ఆపరేషన్స్) శ్రీధర్‌రెడ్డి విద్యుత్ సర్వీసులు, ఇతర కాంట్రాక్ట్ పనుల్లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈమేరకు ఆయనను ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేయగా, శ్రీధర్‌రెడ్డి స్థానంలో సబ్ ఇంజనీర్ ఖదీర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174